# కుళ్ళు బోతులున్నారు జాగ్రత్త !

సైకిల్ తొక్కుతూ వెళ్లేవాడు స్కూటరుమీద వస్తున్న వాణ్ణిచూసి అసూయపడితే అర్థం చేసుకోవచ్చు.

ఆకలితో అలమటిస్తున్నవాడు రెండుపూటలూ తినేవాణ్ణి చూసి ఈర్ష్యపడితే అర్థం చేసుకోవచ్చు.



స్కూటరుమీద పోతున్నవాడు కారులో వస్తున్నవాణ్ణి చూసి ఏడిస్తే అర్థం చేసుకోవలసిన అవసరంలేదు. ఆలోచించాలి.

రెండుపూటలూ తినేవాడు మూడోపూట కూడా చిరుతిండి తినేవాణ్ణి చూసి కుళ్ళిపోతే అర్థం చేసుకోవలసిన పనిలేదు, ఆలోచించాలి.

ఆత్మన్యూనత నుంచే అసూయపుడుతుందంటారు. ఆమాట అక్షర సత్యమని ఇప్పటికే చాలా మంది అంగీకరించారు.

అసూయాపరులు అన్ని రంగాల్లోనూ ఉంటారు. అలాగని అందరూ అసూయాపరులుకారు. సాహితీ రంగానికి వస్తే కవుల్లో అసూయాపరులు ఎక్కువ. కథల ద్వారా ఎక్కువ ప్రాచుర్యం పొందే రచయితల్ని చూసి కొందరు కవులు ఈర్ష్యపడడం చూస్తూనేవున్నాం.

మరెంతగానో ప్రాచుర్యం పొందే నవలాకారుల్ని చూసి కొందరు కథకులు అసూయపడిన సందర్భాలు తెలుసుకుంటూనే వున్నాం.

ఒక వాణిజ్య సంస్థలో పనిచేసే ఓ క్లర్కును చూసి తరచూ ఊళ్ళు తిరిగే సేల్స్‌మెన్ ఈర్ష్యపడవచ్చు. అలాగే సేల్స్‌మెన్‌ను చూసి క్లర్కు అసూయపడవచ్చు. ఒక పత్రికా కార్యాలయంలో పనిచేసే సబ్ ఎడిటర్ బటయ తిరిగే రిపోర్టర్‌ను చూసి ఈర్ష్యపడవచ్చు.

అలాగే సబ్ ఎడిటర్‌ను చూసి రిపోర్టర్ అసూయపడవచ్చు.

ఇలాంటివి కేవలం ఈర్ష్యలవల్ల ఆయా రంగాలకూ, సంస్థలకూ పెద్దగా నష్టం ఉండదు. ఆయా వ్యక్తులకూ అంతగా కష్టం వుండదు.

ఏ రంగంలోనైనా ఈర్ష్య నుంచి మంచి పోటీవస్తే మంచిదే. అలా జరగడం చాలా అరుదు. కానీ ఇద్దరూ సేల్స్‌మెన్‌లై ఉన్నప్పుడు వారిలో ఒకడు ప్రతిభావంతుడైతే రెండోవాడు ఈర్ష్యాపరుడవుతాడు. ముందుకు దూసుకెళ్తున్నవాణ్ణి అడ్డడం కోసం చేతగాని వాడు కుల రాజకీయాలో, మరే నికృష్ట రాజకీయాలో చేస్తాడు. అప్పుడు సమర్థుడు దెబ్బతినవచ్చు. ఆ కారణంగా ఆ సంస్థా కుంటుపడవచ్చు.

సాధారణంగా సమర్థులూ, మేధావులూ తమ ప్రతిభనూ మేధస్సునూ మాత్రమే నమ్ముకుంటారు.

ఆ కారణంగా వాళ్ళల్లో చాలమంది మంచివాళ్లూ అమాయకులూ ఉంటారు.

అసమర్థులూ నైపుణ్యంలేని వాళ్ళూ సమర్థులతో పోటీపడలేక వాళ్ళ ఉన్నతిని చూడలేక కుళ్లిపోతూ కుళ్ళు రాజకీయాలకు పాల్పడుతుంటారు.

పవిత్ర దేవాలయాలుగా చెప్పుకునే కాలేజీల్లోనూ యూనివర్సిటీల్లోనూ కూడా కుళ్ళుమోతులు ఉంటారుంటారు. లేకుంటే విశ్వవిఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు డాక్టర్ విశిష్ట నారాయణ్‌సింగ్ పిచ్చివాడెందుకవుతాడు?

డాక్టర్ సింగ్ బాలమేధావిగా కూడా పేరుపొందాడు. 1963లో మెట్రిక్ పరీక్షలో పాత రికార్డుల్ని అధిగమించాడు. ఇంటర్ విద్యార్థిగా ఉండగానే బియస్‌సి. మేథమేటిక్స్ సునాయాసంగా చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. తర్వాత సరాసరి ఎంఎస్‌సి పరీక్ష రాసి చరిత్ర సృష్టించాడు. ఆ తర్వాత అమెరికాలోని ఓ యూనివర్సిటీ ఆహ్వానం మీద అక్కడికెళ్ళి పిహెచ్‌డి, డిలిట్ పూర్తిచేసి స్వదేశానికి వచ్చాడు. కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా చేరాడు.

డా. సింగ్ అనూహ్య మేధాసంపత్తినీ ఆయనకు లభిస్తున్న పేరు ప్రఖ్యాతుల్నీ చూసి సహోద్యోగులు కుళ్ళుకున్నారు. క్షుద్ర రాజకీయాలు ప్రారంభించి ఆయనకు మనశ్శాంతి లేకుండా చేశారు. మతితప్పి, గతితప్పి ఎక్కడెక్కడో ఏళ్ళకు ఏళ్ళు తిరిగిన డాక్టర్ సింగ్ ఈ మధ్యే పాట్నాకు సమీపంలోని బసంత్‌పూర్ గ్రామంలో ఉన్న తన కుటుంబ సభ్యులను చేరుకున్నాడు అయినా ఇంకా పిచ్చిచూపులు చూస్తూనే వున్నాడు.

కొందరి ఈర్ష్యకు సింగ్ బలయ్యాడు. దేశం ఒక మహామేధావిని కోల్పోయింది.

అందుకే సమర్థులనూ, మేధావులనూ ముందుగా జాగ్రత్తపడాలనే ఉద్దేశంతో ప్రేమగా హెచ్చరిస్తున్నాను.–

కుళ్లుబోతులున్నారు జాగ్రత్త!

9.5.93

ఆంధ్రభూమి దినపత్రిక